క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చారకొండ: మండల కేంద్రంలో పద్మావతి వేంకటేశ్వర స్వామి 14వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం భజన కార్యక్రమం, శుక్రవారం ఉదయం ధ్వజారోహణము, అర్చనలు , 11:45 స్వామివారి కల్యాణ మహోత్సవం, అనంతరం సాయంత్రం అర్చనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీలో బుధవారం ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారి కార్తీక్‌పై వీధి కుక్కలు దాడిచేసి రెండు చోట్ల గాయపరిచాయి. గమనించిన తల్లిదండ్రులు కుక్కలు తరిమివేశారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చెరువుల పండుగ ఘనంగా నిర్వహిద్దాం

వెల్దండ: మండలంలోని గ్రామాల్లో ఊరు–ఊరు చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కుప్పగండ్ల, చెర్కూర్, రాచూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో చెరువుల పండగా ఏర్పాట్లను పరిశీలించారు. శుభ్రం చేసి బతుకమ్మ, బోనాలతో ఊరేగింపుగా పెద్ద ఎత్తును ప్రజలు తరలిరావాలన్నారు. గ్రామస్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు.

అన్ని వర్గాలకు 'ఐక్యతా' సేవలు



కల్వకుర్తిరూరల్: సమాజంలోని అన్ని వర్గాలకు ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తామని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అల్వాల్‌రెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల హర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: ముఖ్యమంత్రి వెనకబడిన తరగతులు, కులవృత్తుల వారికి బీసీబంధును ప్రకటించడంపై జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హర్షం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు ప్రభుత్వం తరుపున రూ.లక్ష సాయాన్ని అందజేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని నాయకులు కొండోజు రవీంద్రాచారి, దామోదరాచారి, సుదర్శనాచారి, రాజు, రవికుమార్, మధుసూదనాచారి తెలిపారు.

బారికేడ్లు అందజేత



కల్వకుర్తి టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపయోగించే బారికేడ్లను పోలీసులకు భారతి సిమెంట్స్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం భారతి సిమెంట్స్ దుకాణం వద్ద తయారుచేసిన 20 బారికేడ్లను సేల్స్ అధికారులు ధనుంజయ్, సునిల్, లయన్స్‌క్లబ్ ఆమనల్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపడతామని భారతి సిమెంట్ ప్రతినిధులు, క్లబ్ సభ్యులు తెలిపారు.

మాజీ వార్డు సభ్యుడి మృతి

వెల్దండ: మండలంలోని పల్గుతండాకు చెందిన మాజీ వార్డు సభ్యుడు కుకుడాల రాములు(48) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, సర్పంచ్ బక్యనాయక్ పరామర్శించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం బాగు

అమ్రాబాద్: పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఎమిరెడ్డిపల్లిలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటి ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీభత్సం సృష్టించిన గాలివాన

- విరిగిపడిన చెట్లు
- స్తంభించిన రాకపోకలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



బస్టాండ్ దగ్గర కరెంట్ వైర్ల మీద పడిన చెట్టు



తాడూరులో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

తాడూరు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సానికి స్థానిక బస్టాండ్ దగ్గర పాఠశాల ఆవరణలోని చెట్లు విరిగి వైర్ల మీద పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొంత మంది యువకులు రోడ్డుపై విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. అదేవిధంగా మండల కేంద్రం నుంచి కల్వకుర్తికి వెళ్లే ప్రధాన ఆర్ అండ్‌బీ డబుల్ రోడ్డు గుంతకోడూరు సమీపాన పెద్ద వృక్షం విరిగి పడడంతో రాకపోకలు స్తంభించాయి. దాదాపు 2 గంటలకు పైగా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. తాడూరు సర్పంచ్ యాదమ్మ స్పందించి జేసీబీతో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను తీయించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. ఎస్‌ఐ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మహమూద్‌అలీ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. అదేవిధంగా మండలంలోని యాదిరెడ్డిపల్లిలో చెట్ల కొమ్మలు విరిగి ఇళ్ల మధ్యన పడడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తెలకపల్లిలో..

తెలకపల్లి: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఉరుము మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. తెలకపల్లి, గౌరెడ్డిపల్లిలో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు చోట్ల చిన్నపాటి వర్షానికే నీళ్ల నిలిచాయి. భాషమోని లక్ష్మమ్మ ఇంటి రేకులు ఎగిరి పడ్డాయి. మండల కేంద్రానికి సత్యం రేకుల డబ్బా ఎగిరిపోయింది.



పాఠశాల ప్రహరీమీదుగా రోడ్డుపై పడిన కొమ్మలు



యాదిరెడ్డిపల్లిలో ఎగిరిపోయిన ఇంటి రేకులు



తెలకపల్లిలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

'నిరాశ మిగిల్చిన సీఎం కేసీఆర్'



మాట్లాడుతున్న బీఎంపీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా ప్రజలు వరాలు కురిపిస్తాడని ఆశించగా నిరాశే మిగిల్చారని బహుజన ముక్తి పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం సభలో ఆయన మాటలకు స్పందిస్తూ రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగిందని, విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని చెప్పడంలో 2014 కంటే ముందే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3లక్షల కోట్లు, మిగులు బడ్జెట్ ఉన్నదని, ఈ 9ఏళ్ల కేసీఆర్ పాలనలో రూ.5 లక్షల కోట్లు అప్పులతో రాష్ట్రం ముందు వరుసలలో ఉందని అన్నారు. అప్పులు, ఆత్మహత్యల తెలంగాణగా మారిందని, డిస్కంలకు, విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం రూ.50వేల కోట్లు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. వాటిని తీర్చడానికి వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేసే కుట్ర చేస్తున్నారన్నారు. మిషన్ కాకతీయ, భగీరథ పథకాలతో ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదని రాష్ట్ర ఏర్పాటుకు ఉన్న ప్రభుత్వాలు జలయజ్ఞంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో 33 ప్రాజెక్టులు ప్రారంభించి 80 శాతం పూర్తి చేశారన్నారు. అట్టి ప్రాజెక్టులకు కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్లు మార్చి రీడిజైన్లతో రూ.లక్షల కోట్ల బిల్లులు దండుకున్నారని ఆరోపించారు. ధరణి వెబ్‌సైట్ ద్వారా ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో విజయ్, నరేందర్, కల్మూరి శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యమే లక్ష్యంగా పోరుబాట



తాడూరు: బహుజన రాజ్యమే లక్ష్యంగా బీసీలంతా ఐక్యంగా పోరాడాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మహేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మేడిపూర్‌లో ఏర్పాటు చేసిన బీసీ సంఘం సమీక్షలో వారు మాట్లాడారు. బీసీలంతా ఏకమై ఐక్యంగా ఉండడంతో పాటు చట్టసభల్లో బీసీలే అధికంగా ఉండేందుకు పోరుబాట పట్టాలన్నారు. బీసీ, బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో 50 శాతం టికెట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రూ.5 లక్షలకు తగ్గకుండా ప్రతి కుటుంబానికి జీవనాధారం చూపేవిధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య, రాములు, వెంకటేష్, ముత్యాలాచారి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



లింగాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

లింగాల: వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బడిబాటలో ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. బుధవారం 5వ రోజు మండలంలో ప్రొ.జయశంకర్ బడిబాట నిర్వహించారు. మండలంలోని లింగాల, అంబట్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఆయా గ్రామాలలో హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు తమ పాఠశాలల ప్రగతి పత్రాలతో ప్రచారం చేశారు.

వెల్దండ: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేయాలని హెచ్‌ఎం రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్, కలిమిరాళ్లతండా, తుంకిబండతండాల్లో బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింట తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యాబోధన తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంఈఓ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇంటిబాట పట్టారు.

చెంచులకు వైద్య పరీక్షలు



మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని చెంచు పెంటల్లో నివాసం ఉంటున్న వారికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డివిజన్ మలేరియా అధికారి అశోక్ ప్రసాద్ తెలిపారు. మల్లాపూర్, రాంపూర్, పుల్లాయిపల్లి, భౌరాపూర్, మేడిమల్కల, సంగిడిగుండాల చెంచు పెంటల్లో సిబ్బంది బృందాలుగా పర్యటించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు గర్భిణులు, 17 మంది చిన్నారులతో పాటు, 97 మందికి పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలతో పాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి చెంచులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గౌతం, ప్రశాంతి, అభిలాష్, శ్రీవాణి, స్నేహ, దీపక్‌రాయ్, రాజీవ్, ఐటీడీఏ అధికారి సేవ్యానాయక్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. భవనంలో రూ.20లక్షల వ్యయంతో కొత్తగా నిర్మిస్తున్న తరగతి గదుల పనులను పరిశీలించారు. జూనియర్ కళాశాల నిర్వహణ కోసం కల్పిస్తున్న వసతి, సౌకర్యాలపై ప్రిన్సిపాల్ జ్యోత్స్నను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాల చుట్టూ ప్రహరీతో పాటు ఇతర వసతుల కల్పన కోసం అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



కల్వకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బ్రిజ్ భూషన్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని మహిళా రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. జాతీయ క్రీడాకారులపై దుర్మార్గంగా వ్యవహరించిన బ్రిజ్ భూషన్‌ను బీజేపీ ప్రభుత్వం కాపాడుతుండడం దుర్మార్గమన్నారు. రెండు నెలలుగా ఢిల్లీలో మహిళా రెజ్లర్లు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం మహిళలపై వారికున్న వైఖరేంటో అర్థం అవుతుందన్నారు. దేశానికి పేరు తెచ్చామని పతకాలు తెచ్చిన మహిళలను సన్మానించిన నరేంద్రమోదీ ఇప్పుడు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉస్సేన్, భాస్కర్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి సైకిలాబ్ బాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తమ పార్టీ ఎంపీని కాపాడడం కోసం మహిళలపై హింసలు పెంచుతున్నారని ఆరోపించారు. ఎంపీపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సంఘటనపై క్రీడాకారులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీలు స్పందించికనప్పటికీ ప్రధాని నోరు తెరవకపోవడం బాధాకరమన్నారు. రెజ్లర్లకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో నాగార్జున, మనోహర్, కుమార్, రాధాకృష్ణ, పరశురాములు, లక్ష్మీదేవి, రాధిక పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు పుష్కలంగా సాగునీరు

బిజినేపల్లి: జిల్లాలోని ప్రతి ఎకరాకు పుష్కలంగా సాగునీరు అందుతుందని, అందుకు సీఎం కేసీఆర్ ప్రధాన పాత్ర పోషించారని జెడ్పీ చైర్‌పర్సన్ శాంత కుమారి అన్నారు. బుధవారం పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాగునీటిపై వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే రోజుల్లో ప్రతి ఎకరానికి నీరు అందించనున్నారన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధన తర్వాత ఎక్కువ భూభాగం సాగునీరు అంది పుష్కలంగా రెండు పంటలు పండుతున్నాయని అన్నారు.

ప్రాజెక్టులకు అడ్డుపడేవాళ్లను పాతరేస్తాం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: నియోజకవర్గ రైతుల కోసం లిఫ్ట్ ఇరిగేషన్ సాధించినప్పుడు ఎంతో సంతోషపడ్డానని, సాగునీటికి అడ్డుపడేవాళ్లను భూమిలో పాతరేస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు హెచ్చరించారు. బుధవారం మండలంలోని భోగమహేశ్వరంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గంలో 636 చెరువులు, కుంటలు, ఆనకట్టలు కలిగి ఉన్నాయన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటల పెంపుదల జరిగిందన్నారు. అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించే అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టు రెండో దశ సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. టెండర్లు పూర్తయితే సంవత్సరంలో ఉమామహేశ్వర ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ ఎన్నో అద్భుతాలు చేస్తున్నారన్నారు. ఎత్తైన గుట్టలకు సైతం సాగునీరు అందించేందుకు దృఢ సంకల్పంతో ఉన్నామన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్‌చే ప్రాజెక్టును ప్రారంభించి నియోజకవర్గంలో ప్రతి సెంట్ భూమికి సాగునీరు అందిస్తామన్నారు.

సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దే..



డిక్లరేషన్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కల్వకుర్తి: ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన వెంటనే ప్రాజెక్టులను చేపట్టి రైతులకు సాగునీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సాగునీటి సంబరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి కాల్వల ద్వారా ఆయకట్టు వేసినట్లు సాగునీరు అందించామన్నారు. రాబోయే రోజుల్లో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నియోజకవర్గంలో రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, ఎంపీపీ మనోహర, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీకాంత్, డీఈ దేవన్న, అధికారులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి కష్టాలు తీరాయి



అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే

కొల్లాపూర్: రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటి దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు నీటిపారుదల శాఖ సీఈ ఎం.ఏ.హమీత్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. నియోజకవర్గానికి ప్రధాన జలవనరు అయిన కేఎల్‌ఐ ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ప్రాజెక్టు ప్రారంభమైతే తాగునీటి సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందన్నారు. గోపల్‌దిన్నె–సింగోటం లింక్ కెనాల్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్‌ఐ నీటిని మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ అమర్‌సింగ్, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీలు బోజ్యానాయక్, కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల జోరు

- ఏరులై పారుతున్న మద్యం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేట రూరల్: గ్రామాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మంచినీరు దొరకని గ్రామాల్లో సైతం మద్యం పుష్కలంగా లభిస్తుంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యాపారం జోరుగా సాగుతోంది. మద్యం అక్రమ విక్రయాల మాటున అధిక ధరలకు అమ్ముతూ మందు బాబుల జేబులకు చిల్లులు వేస్తున్నారు.

గల్లీకో బెల్టు షాపు..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయి. ఆయా గ్రామాల్లో బొడ్రాయి పండుగ నిర్వహిస్తుండటంతో ఇష్టానుసారంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో అన్ని బ్రాండ్లకు సంబంధించిన మద్యం లభిస్తుంది. వైన్‌షాపులలో ఎమ్మార్పీ రేటుకు తీసుకవచ్చి అధిక రేట్లకు అమ్ముతున్నారు. వైన్‌షాపులు, జిల్లా సరిహద్దులు దాటి అక్రమంగా మద్యాన్ని తీసుకవచ్చి మరీ అమ్ముతున్నా ఎక్సైజ్‌శాఖ అధికారులకు పట్టడం లేదు. కిరాణ దుకాణంలా కన్పించే షాపులలో రూ.లక్షల విలువైన మద్యాన్ని దాచిపెడుతున్నారు. అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, పదర మండలాలకు చెందిన గ్రామాల్లో ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కన్పించడం లేదు. కొన్ని గ్రామాల్లో కల్తీ మద్యాన్ని కూడా అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నా అధికారులు చేతులెత్తేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీ రేటు కంటే క్వాటర్ సీసాపై రూ. 20 అదనంగా తీసుకుంటున్నారు. కిరాణా షాపులతో పాటు, చిన్న చిన్న హోటల్‌గా ఏర్పాటు చేసుకుని అక్కడే మద్యాన్ని అమ్ముతున్నారు. బెల్టుషాపుల దందాపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులకు ఎక్సైజ్ అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. తమ టార్గెట్ ప్రకారం అధికారులు పని చేస్తున్నారని, ఎమ్మార్పీ రేటు, కల్తీ మద్యంపై ఎలాంటి దృష్టి సారించడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



బెల్ట్‌షాపులో పట్టుకున్న మద్యం (ఫైల్)

చర్యలు తప్పవు..

అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 8 మందిపై కేసులు నమోదు చేశాం. అక్రమ సిట్టింగ్‌లు, మద్యాన్ని అధిక రేట్లకు అమ్మితే చర్యలు తప్పవు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అక్రమంగా వెలుస్తున్న బెల్ట్ షాపులపై నిఘా పెట్టాం.

– బాల్‌రాజు, ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట.

నకిలీ విత్తనాలపై కొరడా!

- ప్రత్యేక బృందాలతో తనిఖీ
- పట్టుబడితే కేసులు
- రైతులకు ముందస్తు సూచనలు

ఊర్కొండ: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి మోసానికి గురికాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించకుండా వ్యవసాయ అధికారులు, పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రత్యే బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు దుకాణాలు, అక్రమ వ్యాపారుల ఇళ్లపై సోదాలు నిర్వహిస్తున్నారు.

మండలంలో 12 దుకాణాలు

మండలంలో 12 దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా విత్తనాలు విక్రయించేందుకు వ్యవసాయ అధికారులు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వం గుర్తించిన కంపెనీల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలి. కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విత్తనాలు తీసుకొచ్చి తక్కువ ధరకు రైతులకు అంటగడుతున్నారు. అవి నాణ్యమైనవి కాకపోవడంతో దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఇలా రైతులు మోసపోయి ఇబ్బందులు పడకుండా వారం క్రితం జిల్లా వ్యాప్తంగా విత్తనాల దుకాణాల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతే కాకుండా విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎక్కువగా పత్తి పంటనే సాగు చేస్తుండంతో విత్తనాలు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు.



ఊర్కొండలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



విత్తన వ్యాపారులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వాటిని మాత్రమే విక్రయించాలి. అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తాం. రైతులు కూడా తక్కువ ధరకు లభించే విత్తనాలు కొనుగోలు చేయొద్దు. అన్ని అనుమతులు ఉన్నవాటిని కొని తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

– శోభరాణి, ఏఓ

సమాచారం అందించాలి



ఎక్కడైన నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. నకిలీ విత్తనాలను పట్టుకునేందుకు గట్టి నిఘా పెట్టాం. ఇప్పటికే చాలా దుకాణాల్లో సోదాలు చేశాం. ఇప్పటికే వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశాం.

నరేష్, ఎస్‌ఐ, ఊర్కొండ